
# దళారీలు

కొరుకొండ సత్యానంద్



**సుజాత** వైపు అయోమయంగా చూశాను.

కలకలలాడుతూ తిరిగే సుజాత బల్లిలా మంచాన్ని కరుచుకొని పడుకుంది. మిలమిల మెరిసే కళ్ళు కాంతి విహీనమై లోతుకుపోయి ఉన్నాయి. ముఖం పాలిపోయినట్లుగా ఉంది. చేతులు తోటకూర కాడల్లా బలహీనంగా వేళ్ళాడి పోయి ఉన్నాయి.

సుజాత శరీర సౌష్టవం ఎంతో అందంగా, ఆకర్షణీయంగా ఉండేది. నవ్వినా, మాట్లాడినా, మౌనంగా ఉన్నా ఆమె ముఖం, కళ్ళు, కదలికలు ఎంతో ముచ్చటగా ఉండేవి.

కానీ, ఇప్పుడు సుజాతను చూస్తుంటే నాకు భయం వేస్తోంది. అతి కష్టంమీద నన్ను నేను కంట్రోల్ చేసుకుంటున్నాను కానీ, లేకపోతే బావురుమని ఏడ్చే సేవాణ్ణి.

రాంబాబు నా చిటికెన వేలిని పట్టుకొని మౌనంగా సుజాత వైపు చూస్తున్నాడు. వాడి వయసుకు జరుగుతున్న దేమిటో అర్థం కాదు.

వాణ్ణి చూస్తుంటే నా గుండె చెరువైపోయింది.

'వీణ్ణి తల్లి లేని అనాథను చేయకు, భగవాన్!' మనసులోనే దేవుణ్ణి స్మరించాను.

రాంబాబును ఆపరేషన్ చేసి తీశారు.

"రెండో డెలివరీ అయ్యాక ఆపరేషన్ చేసెయలి. మూడో కాన్పుకు అవకాశం లేదు." అప్పుడు డాక్టరు అన్న మాట లవి.

అయిదేళ్ళ తరవాత మళ్ళీ సుజాత గర్భవతి అయింది.

ఆపరేషన్ లేకుండానే పుట్టిన పాప పుట్టిన వెంటనే పోయింది.

ఆ వార్త విని నా గుండె బాధతో బరువెక్కిపోయింది. తరవాత సుజాత పరిస్థితి ప్రమాదకరంగా మారిపోయింది.

సుజాతను చూస్తుంటే మతి పోతోంది.

డాక్టర్లు ఏవేవో పరీక్షలు చేస్తున్నారు. ఆత్రతగా చూస్తున్నానే గానీ, నా నోటి వెంట మాటలు రావడం లేదు. బాధతో మూలగడానికికూడా ఓపిక లేదు సుజాతకు. మామయ్యగారు, అత్తయ్య, నాన్నగారు, అమ్మ- అందరి కళ్ళలోంచి బాధ, ప్రేమ, ఆత్రత-ఇవన్నీ కన్నీళ్ళుగా జాలువారిపోతున్నాయి.

డాక్టర్ అందర్నీ బయటికి పొమ్మంది. బయటకు వెళ్ళిపోయి అందరం కిటికీలోంచి లోపలకు చూస్తున్నాం.

సుజాత మంచం చుట్టూ తెల్లని కర్టెను అమర్చారు. హడావుడిగా ఏవేవో పరికరాలు తీసుకెళ్తున్నారు.

పది నిమిషాల తరవాత డాక్టర్ బయటికి వచ్చింది చెమట తుడుచుకుంటూ.

ఆత్రతగా మే మందరం ఆమె చుట్టూ చేరాం.

"బ్లడ్ కావాలి...ఓ గ్రూపు" అందామె.

"బ్లడ్...బాంకులో..." నీరుగారి పోతున్నట్లుగా అన్నాన్నేను.

"ఆ గ్రూపు లేదు...మీ బ్లడ్ టెస్టు చేస్తాం ...రండి" అందామె.

ఆమెను అనుసరించాను నేను.

పరీక్ష జరిగాక పెదవి విరిచిం దామె.

"మీ వైపు వాళ్ళయినా, ఆమె వైపు వాళ్ళయినా ఎవరైనా యంగ్ పీపుల్ ఉంటే తీసుకురండి. సాయంత్రం నాలుగు గంటల లోగా ఎక్కించాలి" అందామె.

నేను బయటికి పరుగెత్తాను.

మా తమ్ముళ్ళు, వాళ్ళ అన్నయ్యలు అందరి దగ్గరకూ వెళ్ళాను. అందర్నీ రెండు గంటల్లో తీసుకొని వచ్చాను.

అందర్నీ పరీక్షించారు. నాన్నగారు, మామయ్యగారుకూడా ఓ ఇద్దర్ని తీసుకొచ్చారు.

కానీ, ఎవ్వరి రక్తం పనికి రాలేదు.

బెడ్‌మీద స్పృహ లేకుండా పడి ఉన్న సుజాతను ఒక్కసారి చూశాను. నాలో ఆందోళన ఎక్కువయింది. వెంటనే బయటికి వచ్చేశాను.

ఎక్కడికి వెళ్ళాలో, ఏం చేయాలో నాకు తోచలేదు. హాస్పటల్ గేటు దాటుతుండగా "సార్!" అని నన్నెవరో పిలిచినట్లై పక్కకి తిరిగి చూశాను.

గేటు దగ్గరున్న వాచ్‌మన్ నాకు దగ్గరగా వచ్చి, "తమ పెషెంటుకి బ్లడ్ కావాలిట కదూ, సార్?" అని అడిగాడు.

తలూపాను. పెద్దగా పట్టించుకోకుండా.

"ఏ గ్రూపండీ?"

అసహనంగా చెప్పి కదలబోయాను.

"ఏం సార్, ఎక్కడికి వెళ్ళిపోతున్నారు? మీ కా గ్రూప్ రక్తం అక్కర్లేదా?"

టక్కున ఆగాను.

"ఆ గ్రూపు రక్తం ఉన్న మనిషిని నేను తీసుకొస్తాను, సార్" అన్నాడు వాడు.

వాడి వైపు అదోలా చూశాను నేను.

"ఏ గ్రూపు రక్తమైనా ఆ రక్తం ఉన్న మడుసులందరూ నాకు తెలుసు, సార్. అయితే, కొంచెం ఖర్చవుద్ది."

"ఖర్చు ఎంతయినా ఫర్వాలేదు. ముందతన్ని తీసుకురా" అని అనబోయి ఆగి "ఎంతవుతుంది?" అని అడిగాను.

"రక్త మిచ్చేవోడికి వంద, నాకు పది, ఖర్చులికి పది, సింహాచలానికి పదిహేను, సార్" అన్నాడు వాడు.

"మధ్యలో వాడెవడు?"

"అసలోడు వాడేనండి! రక్తం గ్రూపులు, ఆ గ్రూపు మనుసులు-ఆ లిస్టంతా ఆడి దగ్గరే ఉంటాదండి. ఎల్లి సెప్పమంటారా?"

"వెంటనే తీసుకురా" అన్నాను.

"ఓ ఏభై అడ్వాన్సివ్వండి."

ఏభై నోటు తీసిచ్చాను.

×× ×× ××

నల్లగా, బక్కపలచగా ఉన్నాడు వాడు. తైల సంస్కారం లేని తల, చిరిగి ఉన్న బట్టలు...వాణ్ణి చూస్తుంటే నాకు కాస్త జుగుప్స కలిగిందన్న మాట నిజమే!

కానీ, ఆ క్షణంలోనే అనిపించింది...'వీడి రక్తమే కదా నా సుజాత ప్రాణాల్ని కాపాడుతుంది' అని.

దూరంగా వాచ్‌మన్, సింహాచలం అనే వ్యక్తి ఏవో మంతనాలాడుకుంటున్నారు.

రక్తం ఎక్కించడం అయిపోయింది.

"ఇంకేం ఫరవాలేదు" అంది డాక్టరు.

నాకు ధైర్యం వచ్చింది.

వాడు నీరసంగా పైకి లేచాడు.

అంతలోనే వాచ్‌మన్, సింహాచలం నా దగ్గరికి వచ్చారు.

వాచ్‌మన్‌కి మిగతా డబ్బు ఇచ్చేశాను.

వాళ్ళు ముగ్గురూ వెళ్ళిపోయారు.

పది నిమిషాల తరవాత నర్సు వచ్చి "ఈ మందులు వెంటనే తీసుకురండి" అని నాకో చీటీ ఇచ్చింది. నేను బయటికి బయల్దేరాను. గేటు దగ్గరికి వెళ్ళేసరికి ఆ పక్కనుండి వినిపిస్తున్న మాటలు విని నేను అక్కడే ఆగిపోయాను.

"ఇది చాలా అన్యాయం, సింహాచలం." జాలిగా ఒక గొంతు.

"అన్నాయం ఏంట్రా?"

"వందిస్తానని చెప్పి పాతిక ఇయ్యడం అన్నాయం కాదేంటీ?"

నేను తొంగి చూశాను వాళ్ళ వైపు.

గేటుకి గోడ పక్కన మూలగా వాచ్‌మన్, సింహాచలం, సుజాతకు రక్తం ఇచ్చిన మనిషి ఉన్నారు.

"నువ్వన్నది నిజమేరా! కానీ, నీ రక్తం ఎక్కడ పడితే అక్కడ దొరికే రక్తమేనట్రా! నరైన తిండి తింటే మంచి రక్తం ఉంటాది కానీ, ఏ గడ్డి పడితే ఆ గడ్డి తినేవోడికి మంచి రక్తం ఎక్కడుంటాది? అందుకే నీ రక్తానికి ఏభై రూపాయలే వచ్చింది. పది వాచ్‌మన్ గాడికీ, పదిహేను నాకూను! మామూలేగా-మిగిలిన పాతికా నీ కిచ్చాను. ఇందులో అన్నాయం ఏవుందిరా? అంతగా అయితే ఈ అయిదూ తీసుకో- నాకు పది సాల్లే! సరేనా? ఎల్లు మరి" అని వాడి భుజం తట్టాడు సింహాచలం.

వాడు మౌనంగా వెళ్ళిపోయాడు.

"ఇందరా నీ ఇరవై" అని సింహాచలం ఇరవై రూపాయల నోటుని వాచ్‌మన్ చేతిలో పెట్టాడు.

"ఇదేంటి, గురూ?"

"ఏరా, సాల్దా? నీకు పదనీ, ఖర్చులకు పదనీ ముందే కొట్టేసుంటావు కదా- ఇదో ఇరవై-సరిపెట్టుకో. మల్లీసారి కేసులో సూస్కుందాం."

"అలాగేలే అయితే!" అని ఆ నోటుని అందుకొని "ఎలాగైతేనేలే, ఏదోటి సెప్పేసి బాగా మస్కా కొట్టే సినావు అణ్ణో" అన్నాడు వాచ్‌మన్.

"మరేటనుకున్నావ్? సింహాచెలవా, మజాకా? మరి నే నొత్తాను" అని ముందుకు కదలబోయాడు.

"అగు...ఎక్కడికీ?" అని అడిగాడు వాచ్‌మన్.

"ఇంకెక్కడికీ? సారా కొట్టుకి...నాలికూకేగా లాగేత్తంది.

"నడు, నేనూ ఒత్తాను. నా[...]గేత్తంది."

ఇద్దరూ కలి[...]ళ్ళిపోయారు.

[...]డిపోయాను.

మందుల [...]వుక వెళ్తుంటే దార్లో కిరాణా కొట్టు దగ్గర సంచిలో బియ్యం పోయించుకుంటూ సుజాతకు రక్తం ఇచ్చినవాడు కనిపించాడు. ★

